# స్నేహానికి నిలువుటద్దం

### మిత్రుని తండ్రి మృతికి అండగా నిలిచిన 2023-24 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు



**పర్వతగిరి/ఫిబ్రవరి 11(జర్నలిస్ట్ వార్త);** పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 2023-2024 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. తమ ఆత్మీయ మిత్రుడు బొట్ల ప్రభాకర్ తండ్రి బొట్ల కనకరాజు అకాల మరణం చెందడం పట్ల సహచర మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.కష్టకాలంలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇస్తూ, తమ వంతు బాధ్యతగా 10,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించి ప్రభాకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ సహచర మిత్రులుకొల్లూరి రవి,కూరపాటి రాజు,బొట్ల మహేశ్వరి,నరుకుడు రవీందర్,ముప్పిడి రంజిత్,కందకట్ల ప్రవీణ్,పెండ్యాల నవీన్,గోకుల బాబు, ఇస్లావత్ వెంకన్నవల్లందాస్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## మంగళపల్లిలో బుధవారం వారసంత ప్రారంభం



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి11 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మంగళపల్లి గ్రామంలో నూతనంగా బుధవారం వారసంత (కూరగాయల మార్కెట్) ప్రారంభమైంది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వారసంతను ఏర్పాటు చేసినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. బుధవారం సాయంత్రం రాంనగర్ గ్రామ సర్పంచ్ దప్పు శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు సంయుక్తంగా కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రారంభమైన తొలి రోజే మంగళపల్లి గ్రామ ప్రజలతో పాటు సమీపంలోని రాంనగర్ తండా, బొల్లోనిపల్లి గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో మార్కెట్‌ను వినియోగించుకున్నారు. గ్రామంలోనే వారసంత ఏర్పాటు కావడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సౌకర్యం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో బుధవారం వారసంత ఏర్పాటు చేసినందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మార్కెట్ వల్ల రైతులు, వ్యాపారులు, వినియోగదారులందరికీ మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## పీఎంజెజెబివై కింద రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కుల పంపిణీ





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 11 (జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజెజెబివై) పథకం కింద యూనియన్ బ్యాంక్ కొత్తకొండ శాఖ ఆధ్వర్యంలో రెండు కుటుంబాలకు భీమా చెక్కులు అందజేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన కందుల సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు యూనియన్ బ్యాంక్‌లో పీఎంజెజెబివై బీమా ప్రీమియం చెల్లించినందున, ఆయన కుటుంబానికి రూ. 2,00,000 భీమా మొత్తాన్ని చెక్కుగా అందజేశారు. ఈ చెక్కును మృతుడి కుమార్తె కందుల ఐశ్వర్యకు అందించారు. అదేవిధంగా ధర్మారం గ్రామానికి చెందిన కాదాసు స్వరూప అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కూడా పీఎంజెజెబివై పథకంలో బీమా ప్రీమియం చెల్లించినందున రూ. 2,00,000 భీమా చెక్కును మృతురాలి కుమారుడు కాదాసు ప్రశాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కొత్తకొండ శాఖ మేనేజర్ కోడం పరమేశ్వర్, ఆర్డీవో వర్షిత్, డిప్యూటీ మేనేజర్ కోట రవీందర్, బ్యాంకు మిత్ర రావుల కిరణ్, కొత్తకొండ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజెజెబివై వంటి బీమా పథకాలు పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.

# డార్విన్ పరిణామ సిద్ధాంతం మానవ నాగరికత పురోగతి"పై సదస్సు

### ధర్మసాగర్ జెడ్‌పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహణ

**ధర్మసాగర్/ఫిబ్రవరి 11 (జర్నలిస్ట్ వార్త):**
శాస్త్రవేత్త చార్ల్స్ డార్విన్ జయంతి సందర్భంగా "డార్విన్ పరిణామ సిద్ధాంతం మరియు మానవ నాగరికత పురోగతి" అంశంపై ఆలోచనాత్మక సదస్సు ధర్మసాగర్‌లోని జెడ్‌పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక (జేవీవీ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ముఖ్య వక్తగా పాల్గొన్న జేవీవీ తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్ కె.బి. ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ, భూమిపై జీవ పరిణామ యాత్రలో మానవుని ఆవిర్భావం చారిత్రక మైలురాయని పేర్కొన్నారు. డార్విన్ ప్రతిపాదించిన సహజ వరణ సిద్ధాంతం జీవుల ఉద్భవం, అభివృద్ధిపై ప్రపంచ దృక్పథాన్నే మార్చిందని తెలిపారు. డార్విన్ రచించిన "ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్" గ్రంథాన్ని ప్రస్తావిస్తూ, లక్షల సంవత్సరాల పాటు జీవులు సహజ వరణం ద్వారా క్రమంగా పరిణామం చెందాయని శాస్త్రీయ ఆధారాలతో వివరించబడిందని చెప్పారు.





పరిణామం కేవలం జీవశాస్త్రానికి పరిమితమయ్యేది కాదని, మానవ నాగరికత పురోగతి, హేతువాదం, శాస్త్రీయ దృక్పథానికి బలమైన పునాది అని ఆయన వివరించారు. మానవ మేధస్సు, భాష, సంస్కృతి, సాంకేతికతల అభివృద్ధి కూడా నిరంతర పరిణామ ప్రక్రియ ఫలితమేనన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, హేతుబద్ధ విచారణ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు ప్రదర్శించిన "మానవ పరిణామం" నాటిక నిలిచింది. ఆదిమ కోతి నుంచి ఆధునిక మానవుడి వరకు పరిణామ దశలను సృజనాత్మకంగా ఆవిష్కరించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, కిరణ్మయి, రామకృష్ణ, రమ్యశ్రీ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డార్విన్ విప్లవాత్మక ఆలోచనల స్ఫూర్తితో శాస్త్రం, హేతువాదం, మానవ పురోగతి విలువలను పాటించాలని పిలుపునిస్తూ సదస్సు ముగిసింది.

# జిల్లాలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తా

### పార్టీ బలోపేతమే లక్ష్యం: వనమా వాసు

**ఖమ్మం/ఫిబ్రవరి11 (జర్నలిస్ట్ వార్త):**
తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లాలో బలోపేతానికి, అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని ఎన్టీఆర్ వీరాభిమాని వనమా వాసు తెలిపారు. జిల్లాలో పార్టీ పునర్వ్యవస్థీకరణకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్‌పై తెలంగాణ ప్రజల్లో నమ్మకం తగ్గిందని, ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ తరుణంలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ పాలనలో స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ



బలోపేతానికి సమష్టిగా శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు.వనమా వాసు సేవలను పార్టీ అభిమానులు అభినందించారు. ఆగస్టు 15న ఇచ్చిన మాట ప్రకారం గ్రామ గ్రామాన పార్టీ దిమ్మెలకు సహాయం చేయడం, అన్న విగ్రహాలకు దాతగా నిలవడం, పంచాయతీ ఎన్నికల్లో పలువురికి ఆర్థికంగా తోడ్పాటు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు చెల్లించడం, పార్టీ కార్యాలయానికి ఇంటర్నెట్ బిల్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, జెండాలు, కండువాలు స్వంత ఖర్చుతో సమకూర్చడం, రాష్ట్ర పార్టీ కార్యాలయానికి రూ. 1 లక్ష విరాళం ఇవ్వడం వంటి సేవలను గుర్తుచేశారు.పార్టీ కష్టకాలంలోనూ ఆర్థికంగా అండగా నిలుస్తున్న వనమా వాసుకు కార్యకర్తలు, అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఖాతాదారులు కేవైసీ తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలి

### ప్రభుత్వ సబ్సిడీలు ఖాతాల్లో జమ కావాలంటే నిబంధనలు పాటించాలి: ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీలత

**రాయపర్తి/ఫిబ్రవరి 11 (జర్నలిస్ట్ వార్త):**
బ్యాంకు ఖాతాదారులు కేవైసీ వివరాలను అప్డేట్ చేసుకున్నప్పుడే ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల నిధులు ఖాతాల్లో జమ అవుతాయని ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీలత తెలిపారు. బుధవారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో వర్ధన్నపేట సిఎఫ్ఎల్ కేంద్రం ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలత మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు తన కేవైసీ వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని సూచించారు. కేవైసీ పూర్తి చేసిన ఖాతాలే యాక్టివ్‌గా ఉండి ప్రభుత్వ సబ్సిడీలు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా జమ అవుతాయని వివరించారు. నిర్లక్ష్యం చేస్తే ఖాతాలు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.అనంతరం వర్ధన్నపేట సిఎఫ్ఎల్ కౌన్సిలర్ ఐత కమలాకర్



మాట్లాడుతూ, కేవైసీ అప్డేట్‌తో పాటు సైబర్ భద్రతపై అవగాహన అవసరమన్నారు. తెలియని లింకులు ఓపెన్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎవరికీ తమ ఖాతా వివరాలు, ఓటీపీలు తెలియజేయవద్దని సూచించారు. మనీ మ్యూల్‌లుగా మారి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఉపసర్పంచ్ తోట సోమనరసయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 13న ఆర్టీఏ సేవలు నిలిపివేత

### వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**ఖమ్మం/ఫిబ్రవరి11(జర్నలిస్ట్ వార్త):**
వాహన్ పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమం కారణంగా ఈనెల 13వ తేదీన జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ సేవలు ప్రభావితమవనున్నాయి. ఖమ్మం జిల్లా రవాణా శాఖ సిబ్బంది హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణలో పాల్గొననున్న నేపథ్యంలో ఖమ్మం రవాణా శాఖ కార్యాలయం, వైరా ఆర్టీఏ కార్యాలయాల్లో ఆ రోజు ఎటువంటి సేవలు అందుబాటులో ఉండవని జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ తెలిపారు.అయితే ఖమ్మం, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల్లో పాక్షికంగా మాత్రమే సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు, ఇతర వాహన సేవల కోసం ముందుగా స్లాట్‌లు బుక్ చేసుకున్న దరఖాస్తుదారులు తేదీలను పునఃసమీక్షించుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు.ప్రజలు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, శాఖకు సహకరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదాలు

### వివాహ వేడుకలో పాల్గొన్న టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



**రాయపర్తి/ఫిబ్రవరి 11 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి (టీఎంపీఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్ మాదిగ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకటసాయిలు కుమార్తె శ్రావణి వివాహం డేవిడ్‌తో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన గారే వెంకటేష్ మాదిగ, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సుఖసంతోషాలతో దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఐత సాయిలు, గారే శ్రీనివాస్, ఆకులపల్లి రవి, గారే సందీప్ తదితరులు పాల్గొన్నారు.

